# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 198 | విశాఖపట్నం | 19-4-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 198 | VISAKHAPATNAM | 19-4-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | PhonePe


## మహిళా రిజర్వేషన్ బిల్లు అడ్డుకోవటం

# జాతికి ద్రోహం: చంద్రబాబు



**నిడదవోలు, పతాకం న్యూస్:** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటం ద్వారా జాతికి ద్రోహం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించాయంటూ శనివారం నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు మహిళలకు అన్యాయం చేశాయన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఓ బ్లాక్ డే అని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని, సుదీర్ఘ కల సాకారం అవుతుందని అందరం భావించామని తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీలోనూ 33 శాతం మంది మహిళల్ని ప్రజాప్రతినిధులుగా చూస్తామని అనుకున్నామన్నారు. మహిళల్ని గౌరవించటం భారత సంస్కృతిలో భాగం అని చెప్పారు. ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలుంటారని మన నానుడి.. నిన్న పార్లమెంటులో దానికి భిన్నంగా జరిగిందని ధ్వజమెత్తారు. అందుకు నిరసనగా నిడుదవోలులో ఎన్డీఏ పక్షాలు నిరసన ర్యాలీ చేపట్టాయన్నారు. మహిళలంతా బయటకు వచ్చి నిరసన తెలిజేయాలని పిలుపు ఇస్తున్నానన్నారు. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని, హోంమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. 50 శాతం మేర సీట్లు పెరుగుతాయని స్పష్టంగా



## 20న జరగనున్న అప్పన్న చందనోత్సవానికి

# ఏర్పాట్లు పూర్తి

**సింహాచలం, పతాకం న్యూస్:** ఈనెల 20న జరగనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈవో జల్లెపల్లి వెంకటరావు తెలిపారు. ఉచిత, రూ. 300 టికెట్ల కొనుగోలుదారులకు వేకువజామున 3.30 గంటల నుంచి, రూ. 1,000 టికెట్ల కొనుగోలుదారులకు ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు, రూ. 1,500 టికెట్లు కొనుగోలు చేసినవారికి వేకువజామున 3.30 గంటల నుంచి దర్శనాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. సింహగిరిపై వాహనాల పార్కింగ్‌కు స్థలం చాలా తక్కువగా ఉన్నందున కొండదిగువనే అందుకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులందరూ తప్పనిసరిగా సొంత వాహనాలను కొండదిగువనే వదిలి, దేవస్థానం ఏర్పాటుచేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాలను కొండదిగువన కృష్ణాపురం గోశాల, పాతఅడివివరం కూడలి, తొలిపావంచా, సింహపురి కాలనీ, శ్రీనివాసనగర్‌లోని నూతన కళ్యాణ మండపాల వద్ద ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

20న (సోమవారం) సాయంత్రం ఆరు గంటల తరువాత భక్తులను మెట్లమార్గంలో కానీ, బస్సుల్లో కానీ అనుమతించబోమని స్పష్టంచేశారు. రాత్రి ఏడు గంటలకు క్యూలైన్ల ద్వారాలు మూసివేసి అప్పటికి వాటిల్లో ఉన్న భక్తులందరికీ రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం కల్పి స్తామన్నారు. అంతరాలయ దర్శనాలు కొద్దిమంది అతి ముఖ్యులకు మాత్రమే కల్పిస్తామని దేవస్థానం ఈఓ ప్రకటిం చారు. తొలిదర్శనం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు, తరువాత రాష్ట్ర ప్రభుత్వం తరపున, తితిదే తరపున పట్టువస్త్రాలు సమర్పించే వారికి, అనంతరం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే అంతరాలయం దర్శనాన్ని ఉదయం ఐదు గంటలలోపు కల్పించనున్నట్టు చెప్పారు.



2లో

రూ.16 కోట్ల ఇంజెక్షన్‌తో పునర్జన్మ... చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన దాతలు, మంత్రి లోకేశ్

## పాత మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలి.. ప్రధానికి ఇండియా కూటమి లేఖ




2లో



6లో

40 ఏళ్లు దాటిన వారు ఆరోగ్యంగా ఉండాలంటే..!

## విపక్షాలు జీవితాంతం చింతిస్తాయి: మోడీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి స్పందించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన విపక్షాలు జీవితాంతం చింతిస్తాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయని ఆయన అన్నారు. ప్రధాని మోడీ అధ్యక్షతన ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం కేంద్రమంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని అన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ఉన్నదే కాకుండా దానిని కప్పిపుచ్చుకోవడానికి వారు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు.

## పేదలకు నాణ్యమైన భోజనమే

# అన్న క్యాంటీన్ల లక్ష్యం: అనిత



**అనకాపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేశారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు నాణ్యమైన భోజనం పెట్టడమే అన్న క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశమని వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో జగన్ రెడ్డి అన్న క్యాంటీన్లను కూడా రద్దు చేశారని ప్రస్తావించారు. పేదలకు భోజనాన్ని దూరం చేశారని ధ్వజమెత్తారు. శనివారం పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. పాయకరావుపేట పట్టణంలో రూ. 61 లక్షలతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు .స్థానికులతో కలిసి అనిత భోజనం చేశారు. భోజనాలు ఏలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడారు. పాయకరావుపేట పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.



## నరకానికి దారిలా...

## ఆర్వీనగర్-పాలగెడ్డ రహదారి

3లో

## తెలంగాణలో మండుతున్న ఎండలు..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో భాుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెుండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం శనివారం 44.6 డిగ్రీలుగా నమోదైంది.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ముందుచూపు..

భగభగమండే ఎండల తరువాత మొదలయ్యే ఖరీఫ్ కాలం... అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా మామూలే! విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి ... తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇందులో సాగునీటికి అవసరమైన వర్షాలు తప్ప మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందుచూపుతో ముడిపడి ఉన్నవే! అయినా, ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వహించటం వల్ల, ముందస్తుగా అవసరమైనన్ని విత్తనాలూ, ఎరువులూ సమకూర్చకపోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గుర్రై, గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా వస్తోంది. పుండు మీద కారం చల్లినట్టు- ఈసారి ఈ కష్టాలన్నింటికీ తోడు ఒకవైపు అమెరికా యుద్ధోన్మాద పర్యవసానం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈపాటికే హెచ్చరించింది. ఈ కారణాలను సాకుగా చూపించి, చేతులు ఎత్తేయకుండా- ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకులు తమ తక్షణ కర్తవ్యంగా పెట్టుకోవాలి. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం మరొక శరాఘాతం. ఏటా 600 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను మనదేశంలో ఉపయోగిస్తున్నారు. ఇందులో అత్యధికం మనదేశంలోనే తయారవుతున్నప్పటికీ- ముడిసరుకుల కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, కష్టకాలం దాపురించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే -- జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. సాగుకు అవసరమైన సరంజామాను సమకూర్చాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. మే 15 నాటికే కాలువల్లో నీరు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అయితే, పొలాలకు ముందుగా నీరివ్వటంతోనే సరిపోదు. అంతకన్నా ముందుగానే అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. నీటిఎద్దడి పరిస్థితి ఎదురైతే- ఏం చేయాలో అవసరమైన సన్నాహాలు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ ... పాలకులు ప్రదర్శించే ముందుచూపే రైతాంగానికి రక్ష. అయితే, అది మాటలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా ఆచరణలో చూపటం నేడు చాలా అవసరం.

## దత్తపుత్రుడు జగన్ తెర తొలగింది: షర్మిల



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు.

## పాత మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుచేయాలి.. ప్రధానికి ఇండియా కూటమి లేఖ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఆమోదించిన 2023 చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రికి లేఖ రాయనున్నట్టు తెలిపారు. ఇండియా కూటమి నేతలు శనివారంనాడిక్కడ సమావేశమయ్యారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, అయితే బిల్లు ముసుగులో దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని విపక్ష నేతలు ఆరోపించారు. ఇదే విషయాన్ని ప్రజల ముందుకు తీసుకు వెళ్లేందుకు దేశవ్యాప్తంగా మీడియా సమావేశాలు నిర్వహించనున్నట్టు 'ఇండియా' కూటమి నేతలు తెలిపారు. 'ఇండియా' కూటమి ప్రత్యేక సమావేశం సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, విస్తృత ఏకాభిప్రాయంతో పార్లమెంటులో ఆమోదించిన పాత మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి సభలో ప్రవేశపెట్టాలని అన్నారు. 'సోమవారం పార్లమెంటు నిర్వహించండి. బిల్లు తీసుకురండి. ఎవరు మహిళా వ్యతిరేకులో అప్పుడు చూడండి. మేమంతా మీకు సపోర్ట్‌గా ఓటు వేస్తాం' అని తెలిపారు. కాగా, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు ఓడించినందుకు నిరసనగా కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు నిరసన చేపట్టాలని పార్టీ శ్రేణులకు బీజేపీ పిలుపునిచ్చింది. మహిళా రిజర్వేషన్లు, చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు స్థానాలు పెరగడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని ఆరోపించింది.

## జాతికి ద్రోహం: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారని వివరించారు. ఏపీలో కూడా 50 శాతం మేర సీట్లు పెరుగేవి... కానీ ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ అజెండా కోసం ఈ దుర్మార్గం చేశాయని మండిపడ్డారు. దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ కోసం పోరాడుతున్నామని, దీనిని అడ్డుకోవటం క్షమించరాని నేరం అని చంద్రబాబు అన్నారు. ఆడబిడ్డలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలకు ఇంత చులకనా ? అని ప్రశ్నించారు. నిన్న జరిగిన విద్రోహాన్ని ప్రతీ ఇంటికీ తీసుకెళతామన్నారు. ఇవాళ చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమేనని, దీనిపై పవన్ కల్యాణ్ తో మాట్లాడానని, ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహిళలను ఓటు అడిగే పార్టీలు మహిళా సాధికారతను అడ్డుకుంటాయా ? అని ప్రశ్నించారు. 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేకపోయారని చెప్పారు. 2023లో బిల్లు ప్రవేశపెట్టినా దీనిని అమలు చేసే నిబంధన పెట్టారని అన్నారు. 2029లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశంతోనే సవరణ బిల్లు తీసుకువచ్చారనీ, కావాలనే కాంగ్రెస్ నేతృత్వంలోని పార్టీలన్నీ ఈ బిల్లుకు 2/3 మంది సభ్యుల మద్దతు రాకుండా అడ్డుకున్నాయని తెలిపారు. దక్షిణాదికి, ఉత్తరాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఏవేవో ఆరోపణలు చేసి సాకులు చెప్పారు.. లేని పోని సాకులతో బిల్లు వీగిపోయేలా చేయటం శోచనీయమన్నారు. ప్రజలు ఎన్నుకుంటేనే చట్టసభల్లోకి వచ్చిన వారు మహిళలకు ద్రోహం చేయటం సరికాదు అని చెప్పారు. జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఏ రంగంలో అయినా సమర్ధవంతంగా పనిచేస్తున్నారు అని తెలిపారు. అలాంటి మహిళలు చట్ట సభలకు వస్తే న్యాయం జరుగుతుందనే ఈ సవరణ బిల్లు వచ్చిందన్నారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారని నిప్పులు చెరిగారు. ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలన్నారు. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై ప్రతీ ఒక్కరిని చైతన్యం చేసేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం అని సిఎం చంద్రబాబు అన్నారు.

## రూ.16 కోట్ల ఇంజెక్షన్‌తో పునర్జన్మ... చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన దాతలు, మంత్రి లోకేశ్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** లక్షల హృదయాల ప్రార్థనలు ఓవైపు, మంత్రి నారా లోకేశ్ కృషి మరోవైపు... అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాన్ని నిలబెట్టాయి. కొన్ని నెలలుగా 'సేవ్ పునర్విక' అంటూ సామాజిక మాధ్యమాల్లో సాగిన మానవతా ఉద్యమానికి సార్ధకత లభించింది. ఆ పసిమొగ్గకు ప్రాణం నిలిచింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ టైప్-1) వ్యాధితో ప్రాణాలతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు బాధితుల సహాయం, మంత్రి నారా లోకేష్ ఆపన్నహస్తం, పునర్జన్మను ప్రసాదించింది. మాటలతో చెప్పలేని ఆవేదన నుంచి ఆనందభాష్పాలు రాల్చే క్షణాలకు ఈ కథ నిలువుటద్దం. అన్నగా అండగా నిలుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రూ.16 కోట్ల విలువైన జీవన సంజీవనిని అందించి, ఆ చిట్టి చెల్లెలి చిరునవ్వును కాపాడారు లోకేష్. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి లోకేష్ సమక్షంలోనే వైద్యులు శనివారం ఉదయం ఆ ఇంజెక్షన్ ను పునర్వికకు అందించారు. ఈ ఘట్టంతో కొన్ని నెలలుగా సాగిన "సేవ్ పునర్విక" ఉద్యమం విజయవంతంగా ఫలించింది "సేవ్ పునర్విక" పేరుతో సాగిన ఈ ప్రచారానికి లక్షలాది హృదయాలు స్పందించాయి. ఫిబ్రవరి నాటికి సుమారు రూ.10 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినా, ఇంకా భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో, తల్లిదండ్రులు ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్‌ను సాయం కోరారు. వారి విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన మంత్రి లోకేష్, చిన్నారి బాధ్యతను తాను తీసుకుంటానని, చికిత్సకు అవసరమైన పూర్తి సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, కేవలం ఆర్థిక సహాయం ప్రకటించడమే కాకుండా, చికిత్స ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు అన్నీతానై పర్యవేక్షించారు. రూ.16 కోట్ల ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి హైదరాబాద్‌కు వేగంగా రప్పించేందుకు తన సిబ్బంది ద్వారా నిరంతరం సమన్వయం చేశారు. చిన్నారికి ఇంజెక్షన్ ఇస్తున్న సమయంలో ఆసుపత్రిలోనే ఉన్న లోకేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏడుస్తున్న పునర్వికను ఎత్తుకుని లాలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. తమ కుమార్తెకు జన్మనిచ్చింది తామైతే, పునర్జన్మ ప్రసాదించింది మంత్రి లోకేష్, దాతలని పునర్విక తల్లిదండ్రులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ చేసిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని, భవిష్యత్తులోనూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు, దాతలు, ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ వారు శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేశారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: అచ్చెన్నాయుడు



**అమరావతి, పతాకం న్యూస్** రాష్ట్ర రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన అచ్చెన్నాయుడు.. రాష్ట్రంలో రైతుల సమస్యలను వివరంగా తెలిపారు. రాష్ట్రంలో శనగల సాగు, ఉత్పత్తి గణనీయంగా పెరిగిన విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. శనగల కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరారు. పీఎస్ఎస్ స్కీం కింద అదనంగా 15,000 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు చేయడానికి కేంద్రం తక్షణమే అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో మొత్తం 7,13,000 మెట్రిక్ టన్నుల శనగ ఉత్పత్తి జరిగినట్లు కేంద్రానికి తెలిపిన మంత్రి.. ఇప్పటివరకు 94,500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు పూర్తి చేసినట్లు వివరించారు. కొనుగోలు లక్ష్యాన్ని 1,78,250 మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. మిగిలిన 68,750 మెట్రిక్ టన్నుల శనగలను త్వరలోనే కేంద్రం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మొక్కజొన్న రైతుల సమస్యను కూడా కేంద్ర మంత్రికి అచ్చెన్నాయుడు వివరించారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు మొక్కజొన్నను రైతులు అమ్ముకోవాల్సి వస్తోందని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. మిర్చి, పొగాకు రైతులు క్రాప్ డైవర్షన్ వల్ల మొక్కజొన్న సాగు పెరిగినట్లు వివరించారు. అధిక దిగుబడి కారణంగా మార్కెట్‌లో మొక్కజొన్న సరఫరా పెరిగిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈతనాల ఉత్పత్తిలో బ్రోకెన్ రైస్ వినియోగం పెరగడంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గినట్లు కేంద్రానికి వివరించారు. పీడీఎస్ స్కీంలో లేకపోయినా ప్రత్యేక పరిస్థితుల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అచ్చెన్నాయుడు వినతి చేశారు. ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషితో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. రైతులకు పూర్తి న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## అక్షయ తృతీయకు దిగొచ్చిన బంగారం ధరలు



**ముంబై, పతాకం న్యూస్:** దేశంలో ఇటీవల కాలంలో వరుసగా పెరిగిన బంగారం ధరలకు తాజాగా బ్రేక్ పడింది. అక్షయ తృతీయకు ముందు జనాలకు ఊరటనిస్తూ ధరలు ఓ మోస్తరు స్థాయిలో దిగొచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 18) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,54,190గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,41,340గా ఉంది. ఇక కిలో వెండి రేటు రూ.2,74,900ల వద్ద కొనసాగుతోంది. విజయవాడలో కూడా ఇవే రేట్స్ ఉన్నాయి. ఇక ఇతర నగరాల్లోని ధరలను పరిశీలిస్తే ప్రస్తుతం చెన్నైలో 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,55,010గా ఉంది. ఢిల్లీలో రూ.1,54,340గా, ముంబైలో 1,54,190గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,090గా, ఢిల్లీలో రూ.1,41,490గా ముంబైలో రూ.1,41,340గా ఉంది.

# వెంటనే ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి : సీఐటియు, సీపీఎం



**మక్కువ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో ప్రధాన జంక్షన్ నుండి సువర్ణముఖి నది వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని అక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకోవాలనీ సిఐటియు, సిపిఎం డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక ఆటో వర్కర్లు, చిరు వ్యాపారులతో సిపిఎం నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా మన్యం జిల్లా సిపిఎం కార్యదర్శి గంగు నాయుడు మాట్లాడుతూ .... ప్రధాన రహదారి పనులు విస్తరణ చేయడం స్వాగతిస్తున్నామని అంటూ ఈ పనులలో టిడిపి నాయకులు ఇష్టానురీతిగా కట్టడాలను తొలగించడం దారుణం అన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలాన్ని ఆక్రమణలదారుల దగ్గర వదిలేసి 80 అడుగుల మేర విస్తరణ చేయడమేమిటి అని ప్రశ్నించారు. ఇప్పటికే రహదారి విస్తరణలో చిరువ్యాపారులు సర్వం కోల్పోయారని, వారి జీవన భృతిపై ఏ ఒక్క ఆలోచన చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడా వ్యాపారులకు కొమ్ము కాసే విధంగా ప్రభుత్వ స్థలాలను వదిలేసి మామూలు రోడ్లను విస్తరణ చేయటం దారుణం అని విమర్శించారు. విస్తరణ కొలతలు సమయంలో అధికారులు ఎవరూ పాలుపంచుకోకుండా, టిడిపి కార్యకర్తలపై వదిలేయడం దుర్మార్గమన్నారు. 100 అడుగుల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని రహదారిని ఆనుకొని ఉన్న చిరు వ్యాపారులకు అలాగే ఆటో కార్మికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే బస్టాండ్ ఏర్పాటుతో పాటు మరుగుదొడ్లు కూడా రహదారి పరిసరాల్లో నిర్మించాలని కోరారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించకపోతే మంగళవారం చిరు వ్యాపారులు, ఆటో కార్మికులతో కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమములో గిరిజన సంఘం నాయకులు ప్రభాకర్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. జిల్లాలో 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో రెండు వేల మందికిపైగా విద్యార్థులు ఉంటున్నారు. వారి రక్షణతోపాటు వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రభుత్వం భావించింది. ఆ ప్రక్రియ ప్రారంభించి వేగంగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఎస్ఎన్ఎల్‌తో అధికారులు సంప్రతింపులు జరిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల హాస్టళ్లలో బయట విద్యార్థులు ఉంటే గుర్తించడంతో పాటు విద్యార్థుల మధ్య గొడవలు, ఇతర సమస్యలను నివారించేందుకు అధికారులకు అవకాశం దక్కుతుంది. అదే సమయంలో మెస్ నిర్వహణ, రోజువారీ మెనూ అమలును జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలోని 234 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించామని, కొద్దిరోజుల్లో పూర్తిచేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు తెలిపారు. అలాగే, రెండో దశలో బీసీ సంక్షేమ శాఖకు చెందిన 29 హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే అవకాశం ఉంది. వసతి గృహాలకు ఇండక్షన్ స్టవ్‌లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలిసింది. యుద్ధం నేపథ్యంలో అనేకచోట్ల గ్యాస్ కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇండక్షన్ స్టవ్‌లను సమకూరిస్తే ఈ తరహా ఇబ్బందులకు చెక్ చెప్పడంతో గ్యాస్‌కు అయ్యే ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ ఖర్చు తగ్గించుకునేందుకు ఇప్పటికే అనేక వసతి గృహాలకు సోలార్ విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు నెలకు 150 వరకు గ్యాస్ సిలిండర్లు అవసరమవుతుండగా, బీసీ సంక్షేమ వసతి గృహాలకు 350 నుంచి 400 వరకు అవసరమవుతున్నాయి. నెలకు వేలాది రూపాయలు గ్యాస్‌కు వెచ్చించాల్సి వస్తోంది. ఇండక్షన్ స్టవ్‌లు ఒక్కో హాస్టల్‌కు మంజూరుచేయడం వల్ల ఈ ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

## పలు బంగారు దుకాణాల్లో చోరీలకు పాల్పడిన దొంగ అరెస్టు



**టెక్కలి, పతాకం న్యూస్:** టెక్కలి, కాశీబుగ్గ పట్టణాల్లోని పలు బంగారు దుకాణాల్లో ఇటీవల చోరీలకు పాల్పడిన నిందితుడ్ని అరెస్టు చేసినట్లు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మందస మండలం భిన్నాలమదనాపురం గ్రామానికి చెందిన కొమ్మాన ఢిల్లీరావు వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన చేసిన అప్పులను తీర్చేందుకు చోరీలకు అలవాటుపడ్డాడు. దీంతో బంగారు దుకాణాల్లో ఆభరణాలు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ.. యజమానులను ఏమార్చి ఆభరణాలతో ఉడాయించేవాడు. టెక్కలి, కాశీబుగ్గ తదితర ప్రాంతాల్లో బంగారు ఆభరణాల చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలించగా.. శుక్రవారం టెక్కలి సమీపాన జగతిమెట్టలో ఢిల్లీరావు పట్టుబడ్డాడు. ఆయన వద్ద రూ.2.15 లక్షల విలువైన 45 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం. మరో తులం బంగారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ బ్యాంకులో తనఖా పెట్టినట్లు గుర్తించాం. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో టెక్కలి సీఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

## నరకానికి దారిలా...
## ఆర్వీనగర్-పాలగెడ్డ రహదారి



**సీలేరు, పతాకం న్యూస్:** ఆర్వీనగర్-పాలగెడ్డ రహదారిని 20 ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో గోతులమయమైంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఆందోళనలు, నిరసనలు తెలిపినా అధికారులు స్పందించడం లేదు. ఈ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అనేక వాహనాలు మరమ్మతులకు గురై వాహనదారులు పడే బాధలు వర్ణనాతీతం. ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురై కాళు,, చేతులు విరగ్గొట్టుకొని ఆసుపత్రిపాలయ్యారు. ఇటీవల సీలేరులో వాటర్ ఏరోడ్రోమ్ ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణకు జేసీ శ్రీపూజ వచ్చినప్పుడు స్థానికులు ఆర్వీనగర్-పాలగెడ్డపై ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు శూన్యమని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాడేరు ఐటీడీఏ అధికారులకు ఎన్నో సార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అయినా స్పందన లేదు. అయితే అధికారులు ఈ రహదారికి రూ.18.5 కోట్లు మంజూరు చేశామని చెప్పి గత ఏడాది సెప్టెంబరులో రోడ్డు పనులు ప్రారంభించారు. ఉన్న రోడ్డును పూర్తిగా తవ్వేశారు. తర్వాత కాంట్రాక్టరు గానీ, అధికారులు గానీ కనిపించలేదు. రోడ్డు పనులపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆర్అండ్‌బీ అధికారులు రంగప్రవేశం చేసి ఈ రోడ్డును నెల రోజుల్లో పూర్తి చేస్తామని పత్రికా ప్రకటనలు గుప్పించి మాయమయ్యారు. అంతే.. రహదారి పనులు ముందుకు సాగలేదు. ఇటీవల కాంట్రాక్టర్ ధారాలమ్మ ఘాట్‌లో 20ఎంఎం మెటల్ పోసి వదిలేశారు. కనీసం దానిపై క్రషర్ బుగ్గి గాని, గ్రావెల్ గానీ వేయలేదు. దీంతో వాహనాలు మెటల్ రోడ్డుపై వెళుతుంటే పక్కకు జారిపోతున్నాయి. ద్విచక్రవాహనదారులైతే ప్రమాదం జరగకుండా వెళ్లలేరు.. అలా తయారైంది.. రోగులను తరలించేటప్పుడు అంబులెన్స్ డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం ఉదయం ఒక కారు ధారకొండ నుంచి చింతపల్లికి వెళుతుండగా రోడ్డుపై వేసిన రాళ్లు కారు టైర్ల మధ్య ఇరుక్కున్నాయి. దీంతో కారు నిలిచిపోయింది. ఒక పక్క మండుటెండలో రాళ్లు తీయడానికి అందులో ప్రయాణిస్తున్న మహిళలు పడిన బాధలు వర్ణనాతీతం. ఈ రహదారిలో నిత్యం ప్రమాదం జరగకుండా ఇంటికి చేరడం గగనమైపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆర్వీనగర్-పాలగెడ్డ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు, వాహనదారులు కోరుతున్నారు.

## సకాలంలో అర్జీలు పరిష్కరించాలి



**పాడేరు, పతాకం న్యూస్:** మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో ఆమెఅధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు ఇచ్చే అర్జీలను పక్కాగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకాలేని పరిస్థితులుంటే, సంబంధిత అధికారులు ముందస్తు అనుమతి పొందాలన్నారు. శాఖపరమైన ఎటువంటి అనుమతినైనా సంబంధిత శాఖకు చెందిన ఉన్నతాధికారి వచ్చి విధిగా అనుమతి పొందాలన్నారు. జిల్లా అభివృద్ధిపై నిర్వహించే సమీక్షలకు పక్కా ప్రణాళికతో హాజరుకావాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని, గ్రామ స్థాయి సమస్యలపై ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా అక్కడే అధికారులు పరిష్కరించాలన్నారు. పైస్థాయి నుంచి వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ టి.నిశాంతి, జేసీ శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, డీఆర్‌వో నీలకంఠరావు గిరిజనుల నుంచి 127 వినతులను స్వీకరించారు. మీకోసంలో ఆర్జీలు సమర్పించిన అర్జీలపై తాజా స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 నెంబర్ కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ టి.నిశాంతి సూచించారు. అర్జీదారులు కాల్‌సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలన్నారు.

## గరీబ్‌రథ్, స్వర్ణజయంతి, షిర్డీ రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ నుంచి బయలుదేరే గరీబ్‌రథ్, స్వర్ణ జయంతి, షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను సవరించామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజూ రాత్రి 8.40 గంటలకు విశాఖ నుంచి బయలుదేరుతున్న విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) జూన్ 18 నుంచి రాత్రి 8.35 గంటలకు బయలుదేరనున్నది. అలాగే ప్రతి సోమ, శుక్రవారాల్లో ఉదయం 8.20 గంటలకు విశాఖ నుంచి బయలుదేరే విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803) జూన్ 19 నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరనుంది. ప్రతి గురువారం విశాఖలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరే విశాఖ-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) జూన్ 18 నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

## 23న సీఎం చంద్రబాబు రాక



**రాంబిల్లి, పతాకం న్యూస్:** అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో విస్తరించిన ప్రత్యేక ఆర్థిక మండలిలో మరో భారీ పరిశ్రమ ఏర్పాటు కానున్నది. రాంబిల్లి మండల పరిధిలోని జడ్.చింతువ పంచాయతీ పరిధిలో 136 ఎకరాల్లో సుమారు నాలుగు వేల కోట్ల రూపాయల పెట్టుబడితో నిర్మించనున్న 'రెన్యూ ఫొటోవోల్టాయిక్స్' ప్లాంట్‌కు (సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ) ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 23వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్లాంట్‌లో సోలార్ విడిభాగాలను ఉత్పత్తి చేస్తారు. సోలార్ విద్యుదుత్పత్తి రంగానికి ఊతం ఇవ్వడంతోపాటు స్థానిక యువతకు ఉపా?ది కల్పించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. 2028 మార్చినాటికి నిర్మాణం పూర్తిచేసుకొని ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. సభ నిర్వహణ కోసం భారీ షెడ్డును నిర్మిస్తున్నారు. ఈ ఏర్పాట్లను తహశీల్దారు పి.సత్యనారాయణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, డిప్యూటీ జోనల్ మేనేజర్ సూర్యనారాయణ, సీఐ నరసింగరావు పర్యవేక్షిస్తున్నారు.

## మహిళా ఓటర్లే అధికం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో ఓటరు జాబితాలను ప్రదర్శించిన నేపథ్యంలో జిల్లా, మండల, పంచాయతీల వారీగా ఉన్న ఓటర్ల వివరాలు బహిర్గతమయ్యాయి. దీంతో జిల్లాలోని 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 4 లక్షల 98 వేల 467 మంది ఓటర్లు కాగా, వారిలో పురుషులు: 2,41,447, మహిళలు: 2,56,997, ఇతరులు: 23 మంది ఉన్నారు. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లు 15,550 మంది అధికంగా ఉండడం విశేషం. అలాగే జిల్లాలోని అన్ని మండలాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని జాబితాల ప్రదర్శన ద్వారా నిర్ధారణ అయింది. పలు సందర్భాల్లో కొన్ని మండలాల్లో పురుషులు అధికంగా ఉండగా, మరికొన్ని మండలాల్లో మహిళలు ఎక్కువగా ఉంటారు. కానీ అందుకు భిన్నంగా జిల్లాలోని మొత్తం పదకొండు మండలాల్లోనూ పరుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు.

## మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం అవసరం: స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు విచారం వ్యక్తం చేశారు. ఈ పరిణామం దురదృష్టకరమని, మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే ప్రయత్నానికి ఇదో ఎదురు దెబ్బ అని ఆయన అభిప్రాయపడ్డారు. 'లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం దురదృష్టకరం. ప్రతిపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడం దారుణం. రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించాలని ఎన్టీఆర్ నాంది పలికారు. పురుషుల కంటే మహిళలే రాజకీయాల్లో గొప్పగా రాణిస్తారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయకూడదు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఎంతో అవసరం. రాబోయే రోజుల్లోనైనా మహిళా బిల్లు గెలుస్తుందని ఆశిస్తున్నాను' అని సభాపతి అన్నారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా మరోసారి ఎన్నికైన హరివంశ్ నారాయణ్ సింగ్‌కు స్పీకర్ అయ్యన్న అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఆయనకు అభినందనలు తెలుపుతూ స్పీకర్ ఓ అధికారిక లేఖ రాశారు. హరివంశ్ నియామకం పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ఆయన తన అనుభవంతో రాజ్యసభ హుందాతనాన్ని మరింత పెంచుతారని స్పీకర్ అభిప్రాయపడ్డారు.

## జీతాలు చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికులు నిరసన




**పార్వతీపురం, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికుల మార్చి నెల జీతాలను ప్రభుత్వం నేటి వరకు చెల్లించలేదని, కనీసం స్పష్టత కూడా ఈరోజుకీ లేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తెలిపింది. కార్మికుల జీతాలు చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు ఎన్.మల్లేష్, టి.తిరుపతి, ఎం శివ, సిఐటియు జిల్లా కోశాధికారి. గొర్లి వెంకటరమణ మాట్లాడారు. పాలకొండ నగరపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలు, సాలూరులో రెండు నెలలు రెగ్యులర్ పెండింగ్ జీతాలు ఉన్నాయని, పార్వతీపురంలో మార్చి జీతం చెల్లించడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి నెల డిఎంఎ కార్యాలయం నుంచి సాంకేతిక సమస్యతో జీతాలు నిలిచిపోయాయని, ఈ సమస్యపై ఎపి మున్సిపల్ యూనియన్, సిఐటియు రాష్ట్ర నాయకత్వం పలు దఫాలు డిఎంఎ కార్యాలయంలోను, ఈనెల 6న బొబ్బిలిలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిని కలిసినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అలాగే రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు, రిటైర్ అయిన వాళ్ళకి కుటుంబాలకు ఉద్యోగాలు, దహన సంస్కార ఖర్చులకు ఇచ్చే డబ్బులు పాతికవేలకు పెంపు, చనిపోయిన వారి కుటుంబాలకి ఉద్యోగాలు, నష్టపరిహారం తదితర డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన నేటి వరకే అమలు చేయలేదన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించుకుంటే ఈనెల 20 నుంచి విధులకు హాజరు కాలేమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత కమిషనర్లు, కలెక్టర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## సమష్టి కృషి వల్లే ఇంటర్ ఫలితాల్లో ప్రథమ స్థానం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీల్లో మన్యం జిల్లా విద్యార్థులు సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని మన్యం జిల్లా చరిత్ర సృష్టించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విద్యార్థులకు, అధ్యాపకులకు ఘనంగా అభినందన కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ విజయం ప్రభుత్వ విద్యా సంస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని, మన్యం జిల్లా విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నాగేశ్వరరావు సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని కలెక్టర్ కొనియాడుతూ దుస్సాలువలతో ఘనంగా కలెక్టర్ సత్కరించారు. విదేశాల్లో 100శాతం స్కాలర్‌షిప్ పొందే విధానాలను విద్యార్థులకు వివరించి, ప్రోత్సహించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులందరితో అంతర్జాతీయ స్థాయి పరీక్షలైన ఎస్ఎటి రాయించాలని నిర్దేశించారు. విద్యార్థుల సందేహాలను ఫోన్ ద్వారా నివత్తి చేయడంతో పాటు, యూట్యూబ్ వీడియోలు, కన్సల్టెంట్స్ సమాచారాన్ని వారికి అందుబాటులో ఉంచాలని అన్నారు.విజయకేతనం ఎగురవేసిన మన్యంఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్‌లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషమన్నారు. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో ఉన్న జిల్లా కంటే మన్యం జిల్లా 7శాతం అధిక ఉత్తీర్ణత సాధించడం ఇక్కడి విద్యా నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

## డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు




**హైదరాబాద్, పతాకం న్యూస్:** సైబర్ నేరగాళ్ల ముఠాలో చిక్కి మోసగించడం నేర్చుకున్నాడు. ఆ అనుభవంతో డబ్బు సంపాదించేందుకు అదే అడ్డదారిని ఎంచుకున్నాడు. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో ఎంతో మంది అమాయకులను బెదిరించి రూ.లక్షలు కొల్లగొట్టాడు. విదేశాల్లో ఉన్న తనను ఎవరూ గుర్తించలేరు, పట్టుకోలేరనే ధీమాలో ఉన్నాడు. ఈ క్రమంలోనే రెండేళ్ల తర్వాత కంబోడియా నుంచి హైదరాబాద్? నగరానికి వచ్చి పోలీసులకు చిక్కాడు. సైబర్ క్రైంలతో సంబంధమున్న నిందితుడు గాజర్ల అవినాశ్(26) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లుగా సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ టి.సాయిమనోహర్ వెల్లడించారు. ఈ మేరకు ఏసీపీ రవీందర్ రెడ్డితో కలిసి డీసీపీ సాయిమనోహర్ మీడియాకు వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండలం కట్లకుంటకు చెందిన గాజర్ల అవినాశ్ అనే యువకుడు బీటెక్ చదువును మధ్యలోనే ముగించాడు. 2024లో ఖతార్‌లో ఉద్యోగం చేస్తున్న శశి అనే వ్యక్తి పరిచయమై కంబోడియాలో డేటా ఎంట్రీ జాబ్స్ నమ్మించాడు. అతడు చెప్పింది నిజమేనని భావించిన అవినాశ్ పాస్‌పోర్టు సంపాదించి కంబోడియా చేరాడు. అక్కడ సైబర్ నేరగాళ్ల ముఠా చేతికి చిక్కాడు. చివరికి తాను మోసపోయినట్టు గ్రహించి బయటపడే దారిలేక వారు చెప్పినట్టు భారతీయుల ఫోన్ నంబర్లకు ఫోన్‌చేసి పెట్టుబడులు, ఓటీపీ, నల్లా బిల్లులు, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్స్, పేరిట భయపెట్టడం, వచ్చిన సొమ్మును మ్యూల్ బ్యాంకు అకౌంట్లలో జమ చేయటం చేసేవాడు. ఎఅవినాశ్ మాత్రం అక్కడే ఉండి సైబర్ మోసాలకు పాల్పడటమే వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన కొందరికి కమీషన్ ఆశచూపి ఏజెంట్లుగా మార్చుకున్నాడు.

# అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ అసహనం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులపై అవగాహన లేకుంటే ఎలా అంటూ.. ఉపాధి సిబ్బందిని, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశ్నించారు. సిద్దాంతం పెద్దకోనేరుకు నీరువచ్చే కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. పెద్దకోనేరుకు ఎలానీరు వస్తుందని, నీరువచ్చే మార్గాలు ఏ విధంగా ఉన్నాయని ఏపీవో శ్రీదేవి, ఇరిగేషన్ ఏఈ, ఉపాధి పథకం ఈసీని ప్రశ్నించ గా.. సరిగా సమాధానం చెప్పలేకపోవడంతో ఆగ్ర హం వ్యక్తం చేశారు. చెరువుకు నీరు వచ్చేందుకు అవసరమైన మార్గాలను రికార్డుల ప్రకారం గుర్తించి ఆక్రమణలు జరిగితే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పట్టా దారు పాసుపుస్తకాల్లో ఎటువంటి తప్పులు లేకుండా రైతులకు అందించ టమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. సిద్దాంతం రెవెన్యూ పరిధిలో రైతుల నుంచి ఎలాంటి సమస్యలు వచ్చాయి? ఎన్ని పరిష్కరిం చారు? అని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించగా.. సరైన సమాధానాలు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. జీతం ఎందుకు తీసుకుంటు న్నారంటూ రెవెన్యూ కార్యదర్శి పనితీరుపై మండిపడ్డారు. అరగంటలో పూర్తి సమాచారం ఇవ్వాలని సమయం ఇచ్చారు. ఆ తరువాత గ్రామానికి సంబంధించిన 405 ఖాతాల వివరాల స్థితిగతులను కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. గ్రామకంఠాన్ని 22-ఏ నుంచి తొలగిస్తున్నట్టు కలెక్టర్ చెప్పడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్‌డీసీ ఎస్వీ లక్ష్మణరావు, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.గోవిందరావు, ఏపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని
## ‘ఉపాధి’ కూలీల నిరసన



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** అసలే మారుమూల గిరిజన ప్రాంతం. ఆ పైన సిగల్స్ సరిగ్గా పని చేయని పరిస్థితి. దీనికి తోడు ఉపాధి హామీ పనుల వద్ద ఫేస్ యాప్. పనికి వెళ్లిన కూలీ ఫేస్ యాప్ పడకపోతే మస్తరులో హాజరు లేక ఆరోజు కూలి లేనట్టే. ఇది ప్రస్తుతం ఏజెన్సీ లో ప్రతి చోటా వినిపిస్తున్న మాట. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఫేస్ యాప్ విధానం రద్దు చేయాలనే నిరసన స్వరంతో వినిపిస్తున్న డిమాండ్. వేరే పని లేక ఉపాధి పని కోసం వెళ్తే ఫేస్ యాప్ విధానంతో గంటల తరబడి పని కోసం నిరీక్షించాల్సి వస్తుందని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండలం కుక్కిడి, ఇరిడి, కె.శివడ, కురుపాం ,జియ్యమ్మవలస మండలాల్లోని జోంగరపాడు, డంగభద్ర గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద గిరిజనులు నిరసన తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో గిరిజన సంఘం మండల నాయకులు బిడ్డిక ప్రకాష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసే దిశగా ఉందన్నారు. పేరు మార్పు చేసి పథకంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారన్నారు. గుమ్మలక్ష్మీపురం పూర్తిగా మారుమూల ఏజెన్సీ ప్రాంతం కావడంతో నెట్వర్క్ సరిగ్గా పనిచేయని పరిస్థితి ఉందన్నారు. ఒకరికి ఒకరు ఫోన్లు మాట్లాడుకునే సందర్భంలో నిత్యం సిగల్స్ సమస్య వెంటాడుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ ప్రదేశం వద్ద కూలీలు గంటల తరబడి పేస్ యాప్ కోసం నిరీక్షించాల్సి వస్తుందన్నారు. పనికి వెళ్లిన పేస్ యాప్ పడకపోతే ఆరోజు కూలిపోయినట్లేనన్నారు. యాప్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.600 చెల్లించాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి ఎండలో పనిచేస్తున్న గిరిజనులకు పని ప్రదేశం వద్ద విశ్రాంతి గుడారాలు ఏర్పాటు చేసే పరిస్థితి లేదన్నారు. కనీసం తాగేందుకు మంచినీరు, మజ్జిగ కూడా ఏర్పాటు చేయలేదని వడదెబ్బకు గురైతే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక సత్యం, బిడ్డిక అడిత్ తదితరులు ఉన్నారు. ఫేస్ యాప్ తో ఇబ్బందులుప్రభుత్వం తీసుకువచ్చిన ఫేస్ యాప్ నూతన విధానంతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదని ఐద్వా నాయకులు బిడ్డిక చామంతి అన్నారు. నెట్వర్క్ సరిగ్గా పనిచేయక, సిగల్స్ లేక ఫేస్ యాప్ సరిగ్గా పనిచేయని పరిస్థితి నెలకొందన్నారు. పనులకు వచ్చిన ఫేస్ యాప్ పడకపోతే కూలీ లేనట్టేనని, కావున పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కె.శివడకు చెందిన ఉపాధి కూలి బిడ్డిక మాధవరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉపాధి కల్పన చర్యలు లేకపోవడంతో ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతున్నారు. పనుల వద్ద ఫేస్ యాప్ వెయ్యాలనే నిబంధన సిగల్స్ సమస్యతో తలనొప్పిగా మారిందన్నారు. ఒక్కొక్కసారి గంటల తరబడి యాప్ పనిచేయని పరిస్థితి నెలకొందన్నారు. మరో కూలి మండంగి పగడాలు మాట్లాడుతూ ఎటువంటి ఉపాధి లేక తప్పని పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళ్తున్నామని, పని ప్రదేశం వద్ద ఫేస్ యాప్ పడక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి, పని ప్రదేశంలో తాగునీరు, పనిముట్లు అందించాలని కోరారు.

## కుక్కల దాడిలో అడవి జింక మృతి



**చిత్తూరు, పతాకం న్యూస్:** తాగునీటి కోసం గ్రామంలోనికి వచ్చిన అడవి జింకపై వీధి కుక్కలు దాడి చేయడంతో జింక మరణించిన ఘటన శనివారం చిత్తూరు జిల్లాలో జరిగింది. చిత్తూరు నగరంలో ఓ జింక మృతి చెందింది. 15వ డివిజన్ రెడ్డిగుంట సమీపంలోని వినాయక స్వామి ఆలయం దగ్గర అటవీ ప్రాంతం నుండి తాగునీటి కోసం వచ్చిన జింక.. కుక్కల దాడికి గురై ప్రాణాలు విడిచింది. చంద్ర అనే స్థానికుడు టిడిపి 15వ డివిజన్ ఇంచార్జ్ రామినేని రాముకు సమాచారం అందించారు. ఆయన ఫారెస్ట్ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి జింకను తీసుకెళ్లారు.

## సిరిమానోత్సవానికి పక్కాగా పురసేవలు’



**బొబ్బిలి, పతాకం న్యూస్:** పట్టణంలో ఈ నెల 26 నుంచి జరగనున్న సరేపోలమ్మ సిరిమానోత్సవంలో భక్తులు, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ నుంచి అన్ని రకాల సేవలను పగడ్బందీగా అందించాలని అధికారులను కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. ఆమె పట్టణంలో పర్యటించారు. సిరిమానోత్సవం నేపథ్యంలో కోవెల వద్ద, రథం తిరిగే ప్రాంతాలను ఆమె ఆలయధర్మకర్త చోడిగంజి రమేష్‌నాయుడు ఇతర పెద్దలతో కలిసి పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రాంతాలలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో లోపం ఉండరాదని, క్లోరినేషన్ సక్రమంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆమె వెంట ఏఈ లు, టీపీఎస్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



**పాతపట్నం, పతాకం న్యూస్:** పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో స్వప్నిల్ పవర్ దినకర్ అన్నారు. కోదూరులో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు వేగంతం చేసుకోవాలని, బిల్లులు కూ డా సకాలంలో మంజూరు అయ్యేలా చూస్తాన న్నారు. పీడీ డి.రమాకాంతారావు, హౌసింగ్ ఈఈ వెంపడాపు నరసింహారావు, డీఈ ఎం.మోహన రావు, ఏఈ వై.సీతారామరాజు ఇంజనీరింగ్ సహా యకులు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణాన్ని చల్లబరిచే నీటి తుంపర్లను వెదజల్లే యంత్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



**విజయనగరం, పతాకం న్యూస్:** నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూపొందించిన నీటి తుంపర్లు వెదజల్లే యంత్రంను నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి ,జిల్లా కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా అధికారి మాట్లాడుతూ .... ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా ప్రజలను ఆకర్షించి ఆస్వాదించే విధంగా ఉండటం విశేషమన్నారు. నగర ప్రజలకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించే విధంగా ఈ యంత్రం అన్ని ప్రాంతాలలో తిరుగుతూ రహదారుల పై నీటి తుంపర్లు వెదజల్లుతూ వాతావరణాన్ని చల్లదనం చేసే విధంగా రూపొందించబడిందన్నారు. నగరపాలక సంస్థలో పాత యంత్రాలు, నిరుపయోగ సామగ్రిని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రయోగాత్మకంగా చేపట్టిన నీటి తుంపర్లు వెదజల్లే యంత్రం ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. జన సామర్థ్యం ఉన్న ప్రాంతాలలోనూ ప్రధాన రహదారులలోను ఈ యంత్రం తిరుగుతూ నీటి తుంపర్లను వెదజల్లుతుందన్నారు. దీనివల్ల వేసవి ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు కొంతమేర ఉపయుక్తంగా ఉంటుందన్నారు.. ఒక ప్రత్యేక వాహనంలో ఈ యంత్రాన్ని అమర్చి, తద్వారా నీటిని వెదజల్లడంతో రహదారులపై 25 మీటర్ల దూరం వరకు నీటి తుంపర్లు వెదజల్లుతూ ఉన్నాయి. ఇందుకోసం వాహనంలో ప్రత్యేకంగా తయారు చేసిన యంత్రంతో పాటు వాటర్ ట్యాంకు కూడా అమర్చారు. ఎన్నడూ లేని విధంగా నగరాన్ని చల్లపరిచే విధంగా నగరపాలక సంస్థ అధికారులు రూపొందించిన ఈ ప్రత్యేక నీటి తుంపర్ల యంత్రం ప్రజలకు ఎంతగానో స్వాంతన చేకూర్చుతోందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ .... వినూత్న ఆలోచనలతో ప్రజలకు ఉపయుక్తంగా ఉండే విధంగా వివిధ రకాల యంత్రాలు రూపొందించడం ఆనందంగా ఉందన్నారు.

## విబిరాంజీ పథకం రద్దు కోరుతూ .... ఉపాధి కూలీల నిరసన



**తాడేపల్లిగూడెం, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, 2025 విబి.రాంజి పథకం రద్దు చేయాలంటూ ... నినాదాలు చేస్తూ మాధవరం గ్రామంలో ఉపాధి కూలీలు నిరసన తెలియజేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా మాధవరం కోతిగుంటలో జరుగుతున్న ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫేస్ యాప్ మస్తర్ విధానం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విబి రాంజీ పథకం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ పథకాన్ని రద్దు చేసి పాత చట్టాన్ని కొనసాగించాలని వారు విన్నవించారు. ఉపాధి కూలీ 600 రూపాయలకు పెంచాలని, 200 రోజులు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు మెట్లు కోటీశ్వరి, తలాల లక్ష్మి, అంకం సూరిబాబు, ఉప్పలపాటి వడ్డికాకులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమానికి ప్రత్యేక చర్యలు



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** మదనపల్లెలో ఐటిడిఎ ఏర్పాటు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేలా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప తెలిపారు. మదనపల్లె లోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గిరిజన సంఘాల నాయకులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని వారి సమస్యలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, రాజంపేట, రాయచోటి, మదనపల్లి ప్రాంతాల్లో ఎరుకుల, యానాది, సుగాలి, లంబాడి గిరిజనులు అధికంగా నివసిస్తున్నారని తెలిపారు. వారి జీవన పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మదనపల్లిలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట పరిధిలో యానాది గిరిజనులకు ఆధార్ కార్డులు లేవని, దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ గిరిజన హాస్టళ్లు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ భూములకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం గిరిజన నాయకులు తమ వినతిపత్రాలను కమిషన్ సభ్యునికి సమర్పించారు. ఈ సందర్భంగా పి.వెంకటప్ప మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎరుకుల, యానాది, సుగాలి వర్గాల జీవనోపాధి అభివృద్ధికి ఐటీడీఏ అధికారులతో చర్చించి అవసరమైన నిధులు, ఆధార్ కార్డుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం మదనపల్లి జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గిరిజనుల అటవీ హక్కుల భూములకు సంబంధించిన ఆర్ఓఆర్ పట్టాల సమస్యలను ఫారెస్ట్ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని, గిరిజన కాలనీల్లో తాగునీరు, విద్య, వైద్యం, పింఛన్లు, విద్యుత్, గృహ వసతి వంటి మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనులకు ఎదురవుతున్న ప్రతి సమస్యను జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మదనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, పాఠశాల ప్రిన్సిపళ్లు, వార్డెన్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.తేజస్విని, ఆర్‌జిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోనేటి దివాకర్, ఇరిగేషన్ డిఒ గంగాధర్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకులు రవీంద్ర, ఆదివాసి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస వర్మ, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సాకే ముసలయ్య, ఎన్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షులు కిరణ్ బాబు, గిరిజన నాయకులు బొజ్జప్ప, సులోచన, మున్నా నాయక్, విశ్వనాథ నాయక్, శ్రీనివాస శర్మ, జి.వి.రమణ, కోనయ్య, లక్ష్మణ నాయక్, గంగరాజు నాయక్, నాగు నాయక్, వెంకటరమణ, వసంతమ్మ పాల్గొన్నారు.

## నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత



**కలికిరి, పతాకం న్యూస్:** నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మేజర్ పంచాయతీ ఈవో జి అశోక్ పిలుపునిచ్చారు. ప్రతినెల మూడవ శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా కలికిరి మేజర్ పంచాయతీలో ఈవో ఏవో అశోక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ ఎంపీడీవో రియాజ్ ఉద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని నిల్వ ఉంచడం, భూగర్భ జలాలను పెంపొందించుటకు, ఇంకుడు గుంతలు తయారు చేయుటకు జి రామ్ జి ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈవో అశోక్ మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలను ఎంత శుభ్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యంగా మనము, మన సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ రెడ్డి వారి యోగేష్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం-దేవరాపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి



**ఖమ్మం, దేవరాపల్లి, పతాకం న్యూస్:** తెలుగు రాష్ట్రాలకు కొత్త జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం-దేవరపల్లి 365 బీజీ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ట్రయల్ రన్‌లో భాగంగా వాహనాల రాకపోకలకు అనుమతివ్వడంతో రయ్ రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి.

విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య దూరాన్ని తగ్గించేందుకు చేపట్టిన ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు 2022లో ప్రారంభమయ్యాయి. 4 వేల 451 కోట్లతో 162 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 365 బీజీ నేషనల్? హైవే పేరిట పచ్చని పొలాల మధ్య నాలుగు వరుసల రహదారి నిర్మించారు. దేవరపల్లి నుంచి తెలంగాణలోని వైరా వరకు పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులు ట్రయల్ రన్‌కు అనుమతించారు. సోమవారం నుంచి నాలుగు వరుసల రహదారిపై భారీ వాహనాలు దూసుకుపోతున్నాయి. కార్లు 100 కిలోమీటర్లు, ఇతర వాహనాలు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణానికి అవకాశం కల్పించారు. ఈ కొత్త రహదారిపై ప్రయాణం సుఖవంతంగా ఉందని వాహనదారులు చెబుతున్నారు.

"ఖమ్మం-దేవరపల్లి రహదారి చాలా బాగుంది. ఇంతకు ముందు పట్టినంత సమయం ఇప్పుడు ప్రయాణానికి అంతగా పట్టడం లేదు. ఇంతకు ముందు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. కానీ ఇప్పుడు ఈ రోడ్ వేసి నందుకు చాలా సౌకర్యవంతంగా ఉంది. గేర్లు మార్చేందుకు ఇంతకు ముందు ఉన్నంత ఇబ్బంది ఇప్పుడు లేదు. ఈ రహదారి కారణంగా మూడు గంటలు పట్టే ప్రయాణం కూడా గంట తేడాతో రెండు గంటలు మాత్రమే పడుతుంది. వాహనాలకు మైలేజ్ కూడా బాగా వస్తుంది. రహదారి లేనందువల్ల ఇంతకు ముందు ఊరు లోపల నుంచి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఈ రహదారి కారణంగా ఇప్పుడు అలాంటి ఇబ్బందులు ఏమీ లేవు. ప్రయాణం చాలా సాఫీగా సాగిపోతుంది." అని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై సాంకేతిక పనులు శరవేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారిపైకి ఎక్కేచోట్ల, దిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టోల్ గేట్ల వద్ద సీసీ కెమెరాలు, ఫాస్టాగ్‌కు సంబంధించిన పరికరాలు అమర్చుతున్నారు. దేవరపల్లి టోల్ గేట్ల వద్ద ఇరువైపులా 8 వరుసలను ఏర్పాటు చేశారు. వాహనదారులు టోల్ రుసుము చెల్లించేటప్పుడు సమయం వృథా కాకుండా చేస్తున్న ఏర్పాట్లు చివరి దశకు చేరాయి.

365 బీజీ గ్రీన్ ఫీల్డ్ హైవేపై ఎంత దూరం ప్రయాణిస్తే ఆ మేరకు మాత్రమే టోల్ వసూలు చేస్తారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నేపథ్యంలో ఇంటర్ ఛేంజ్‌లుగా వీలు కల్పించిన ప్రదేశాల వద్ద ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాల నుంచి మాత్రమే రహదారిపైకి రావడానికి, దిగడానికి అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలో దేవరపల్లి, పొంగుటూరు, జంగారెడ్డిగూడెం సమీపంలోని పుట్లగట్టగూడెం, రేచర్ల వద్ద మాత్రమే వాహనాలు ఎక్కి, దిగడానికి రోడ్డు నిర్మించారు. వైరా నుంచి ఖమ్మం వరకు ఈ నెలాఖరు నాటికి మొత్తం పనులు పూర్తవ్వనున్నాయి. ఆ తర్వాత 365 బీజీ రహదారిని అధికారికంగా ప్రారంభించనున్నారు.

# బంగారం దిగుమతికి 15 బ్యాంకులకు కేంద్రం అనుమతి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** బంగారం, వెండి దిగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 15 ప్రధాన బ్యాంకులకు పసిడి, వెండిని దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అనుమతులు 2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి. బులియన్ దిగుమతులను క్రమబద్ధీకరించడం, నియంత్రిత మార్గాల ద్వారా వాటిని ట్రాక్ చేయడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, బంగారం, వెండి వ్యాపారంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అధికారం పొందిన ఈ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి దిగ్గజ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. అయితే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్బేర్‌బ్యాంక్ (రాఎవతీఝఅని)లకు మాత్రం కేవలం బంగారం దిగుమతికి మాత్రమే అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, దేశంలో బంగారం మార్కెట్ సరళిపై ప్రపంచ స్వర్ణ మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్) విడుదల చేసిన నివేదిక ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 మార్చి నెలలో భారత్ బంగారం దిగుమతులు భారీగా తగ్గి 9 నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఆ నెలలో కేవలం 3.1 బిలియన్ డాలర్ల విలువైన పసిడి మాత్రమే దిగుమతి అయింది. పరిమాణం పరంగా చూస్తే ఇది 20-25 టన్నులు మాత్రమే. సాధారణంగా 12 నెలల సగటు దిగుమతి 62 టన్నులుగా ఉండగా, అందులో ఇది చాలా తక్కువ. మధ్యప్రాచ్యం నుంచి విమాన రాకపోకలకు అంతరాయాలు కలగడం, డిమాండ్ తగ్గడం వంటివి ఇందుకు కారణాలని నివేదిక పేర్కొంది. అయితే, మార్చిలో పడిపోయిన బంగారం ధరలు ఏప్రిల్‌లో పాక్షికంగా కోలుకున్నాయి. దిగుమతులపై ఆంక్షలు, సరఫరా సమస్యల కారణంగా దేశీయ మార్కెట్‌లో డిస్కౌంట్లు తగ్గాయి. ఇదే సమయంలో, 2026 మొదటి త్రైమాసికంలో లిస్టెడ్ జ్యువెలరీ సంస్థలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. వివాహాల సీజన్, అధిక విలువైన కొనుగోళ్లు, సంస్థల విస్తరణ ఇందుకు దోహదపడ్డాయని తెలిపింది. మరోవైపు, పెట్టుబడిదారుల్లో బంగారంపై ఆసక్తి కొనసాగుతోంది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వరుసగా 11వ నెల కూడా పెట్టుబడులు వెల్లువెత్తాయి. మార్చిలో నికరంగా రూ. 22.7 బిలియన్ల (244 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు కూడా బలంగానే ఉన్నాయి. ఫిబ్రవరిలో రూ. 30.3 బిలియన్ల విలువైన డిజిటల్ బంగారం కొనుగోళ్లు జరిగాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వివరించింది.

## తాగునీరు అందడంత లేదని ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు



**కర్నూలు, పతాకం న్యూస్:** రెండు నెలలుగా త్రాగెందుకు మంచినీరు అందించలేరని కర్నూల్ జిల్లా ఆలూరు మండలం ఎం.కొట్టాల గ్రామ ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కడం జరిగింది. ఎం.కొట్టాల గ్రామస్తులు త్రాగు నీరు అందడం లేదని ఖాళీ బిందెలతో ఆలూరు మండల కేంద్రానికి చేరుకొని చెక్‌పోస్ట్ నుంచి ఆలూరు అంబేద్కర్ సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ నిరసనతో సుమారు గంటసేపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డీఈ మల్లికార్జున, ఏఈ రామనీలను బయటకు పంపించి కార్యాలయానికి తాళం వేశారు. తాగడానికి నీరు లేక గుంతకల్, పత్తికొండ ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసి వాటర్ క్యాన్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోయారు. ఇదేనా ప్రభుత్వం చెప్పుకునే అభివృద్ధి అని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇంతటి సమస్య ఉన్నప్పటికీ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. పంది కోన రిజర్వాయర్ నుంచి జి.ఓ. నెం.54 ప్రకారం రూ.6.91 కోట్లతో మంజూరైన ప్రత్యేక పైప్‌లైన్ తమ గ్రామం గుండా వెళ్తున్నప్పటికీ, గ్రామానికి కనెక్షన్ ఇవ్వకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శించారు. మా కళ్ల ముందే పైప్‌లైన్ పోతుంటే మాకు మాత్రం నీరు అందకపోవడం ఎంతటి అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యను పరిష్కరించకపోతే, మరింత తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

## ఉపాధిని పెంచి వలసలను నివారించాలి



**మదనపల్లె, పతాకం న్యూస్:** ఉపాధిని పెంచి వలసలను నివారించడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతుల్లోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలు మదనపల్లె పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. మహాసభకు మండం సుధీర్ కుమార్ అధ్యక్షులుగా వ్యవహరించగా, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 1.20 కోట్ల కుటుంబాలు, వ్యవసాయ కార్మికులుగా జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. వీరందరూ భూమిలేని నిరుపేదలేనని పేర్కొన్నారు. శారీరక కష్టాన్ని నమ్మకుని జీవనం సాగిస్తున్న ఈ వ్యవసాయ కూలీలకు భూపంపిణీ కార్యక్రమం చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లుగా వ్యవసాయ కూలీలకు ఆసరాగా, భరోసాగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతుల్లోని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో విబిజి రామ్ జి చట్టాన్ని తీసుకురావడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ఈ చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలపై నిధుల భారాన్ని పెంచిందన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతమే ఖర్చు చేయాల్సి ఉండగా, ఈ కొత్త చట్టం ద్వారా 40 శాతం ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 60 శాతం నిధులు మాత్రమే కేంద్రం ఇస్తుందని, అది కూడా వెంటనే మంజూరు చేసే పరిస్థితి లేదన్నారు. 40 శాతం నిధుల ఖర్చు చూపాకే అని మెలిక పెట్టడం పథకాన్ని నిర్వీర్యం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. దీని కారణంగా ఆంధ్రరాష్ట్రంలో ఉపాధి హామీ గల్లంతయ్యే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా ల్యాండ్ సీలింగ్ చట్టం అమలవుతున్నప్పటికీ దేశంలో భూస్వాములు సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, పాలకవర్గాలే భూస్వాములుగా ఉండడం గమనార్హమన్నారు. వెంటనే ల్యాండ్ సీలింగ్ చట్టంను పటిష్టంగా అమలుపరిచి మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ మహాసభలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు హరిశర్మ సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు తమ మద్దతు సహాయ సహకారాలు నిరంతరం ఉంటాయని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలకు, జిల్లా నలుమూలల నుండి వ్యవసాయ

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి చర్య లు తీసుకుంటున్నామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహించి సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తం గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, ఉద్యోగ సంబంధిత సమస్యలను నేరుగా ఎస్పీకి ఫోన్‌లో వివరించారు. వారి సమస్యలను తెలుసు కున్న ఎస్పీ తక్షణం పరిష్కారానికి చర్యలు తీసు కుంటానని భరోసా కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ గ్రీవెన్స్ ద్వారా ఉద్యోగ రీత్యా సీనియార్టీ, ప్రమోషన్లు, సరెండర్ లీవ్స్, ఇతర సెలవులు మంజూరు, వేతన బకాయిలు, ఇంక్రిమెంట్, ఆరోగ్య సమస్యలపై తెలియజేయ వచ్చన్నారు. అలాగే విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, భద్రతా సమస్యలు, వ్యక్తి గత, వృత్తిరీత్యా సంబంధిత సమస్యలు విన్నవిం చుకోవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌శాఖ కట్టుబడి ఉందన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం..

**కోనసీమ, పతాకం న్యూస్:** పర్యావరణాన్ని పరిరక్షించాలంటే జలవనరులను కాపాడుకోవాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ తో కల్సి ఆలమూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికంగా చెరువు చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. చెత్త ఇస్తే సరుకులు ఇచ్చే స్వచ్ఛ రథాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, జలవనరుల సంరక్షణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికలో భాగంగా జలధార పేరుతో నీటి భద్రత-- సాగునీటి సంఘాల బాధ్యత అంటూ ప్రభుత్వం జలవనరుల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అంశంలో భాగస్వాములు కావాలన్నారు.

## రూపాయి విలువ పతనం దెబ్బ.. 6వ ఆర్థిక ర్యాంకుకు పడిపోయిన ఇండియా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, తాజాగా రెండు స్థానాలు దిగజారి ఆరవ ర్యాంకుకు పడిపోయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం జపాన్, బ్రిటన్‌లు భారత్‌ను అధిగమించి వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. భారత జీడీపీ వృద్ధిలో వెనుకబడటం దీనికి కారణం కాదు. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన చమురు ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడమే ఈ మార్పుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్, చమురు కొనుగోలుకు భారీగా డాలర్లను వెచ్చించాల్సి వస్తోంది. దీంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి మారకం విలువ క్షీణించింది. ఫలితంగా డాలర్ల లెక్కల్లో భారత జీడీపీ పరిమాణం తగ్గిపోయి ర్యాంకుపై ప్రభావం చూపింది. ప్రభుత్వ వర్గాలు జీడీపీ అంచనాలను సవరించడం కూడా దీనికి మరో కారణంగా నిలిచింది. ఐఎంఎఫ్ అనుబంధ సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' 2026 లెక్కల ప్రకారం ప్రస్తుతం అమెరికా (30 ట్రిలియన్ డాలర్లు), చైనా (19 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (5 ట్రిలియన్ డాలర్లు) తొలి మూడు స్థానాల్లో సుస్థిరంగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో జపాన్ (4.38 ట్రిలియన్ డాలర్లు), బ్రిటన్ (4.27 ట్రిలియన్ డాలర్లు) ఉండగా... భారత్ 4.15 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ఆరో స్థానంలో నిలిచింది. 2022 సెప్టెంబరులో బ్రిటన్‌ను అధిగమించి భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. గతేడాది మే నెలలో నాటి నీతీ ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, జపాన్‌ను కూడా దాటి భారత్ నాలుగో స్థానానికి చేరిందని ప్రకటించారు. అయితే, తాజా పరిణామాలతో ఆ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కాగా, జపాన్, బ్రిటన్, భారత్ జీడీపీల మధ్య వ్యత్యాసం చాలా స్వల్పంగానే ఉంది. రూపాయి మారకం విలువ తిరిగి స్థిరపడితే, భారత్ మళ్లీ నాలుగో స్థానాన్ని దక్కించుకోవడం పెద్ద కష్టమేమీ కాదని, వచ్చే ఏడాదే ఇది సాధ్యపడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 40 ఏళ్లు దాటిన వారు ఆరోగ్యంగా ఉండాలంటే..!

40 ఏళ్లు దాటిన వారు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ అలవాట్లను పాటించాలి నిద్ర లోపం గట్ (జీర్ణ వ్యవస్థ) బ్యాక్టీరియా సమతౌల్యాన్ని దెబ్బతీస్తూ, రక్తంలో చక్కెర నియంత్రణను క్షీణింపజేసి, శరీరంలో ఇన్ఫ్లమేషన్‌ను (వాపు) పెంచుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 40 ఏళ్ల వయస్సు దాటిన తరువాత ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన జీవనశైలి అలవాట్లు అనుసరించడం అత్యంత అవసరమని వారు సూచిస్తున్నారు. నిద్ర లోపం గట్ (జీర్ణ వ్యవస్థ) బ్యాక్టీరియా సమతౌల్యాన్ని దెబ్బతీస్తూ, రక్తంలో చక్కెర నియంత్రణను క్షీణింపజేసి, శరీరంలో ఇన్ఫ్లమేషన్‌ను (వాపు) పెంచుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 40 ఏళ్ల వయస్సు దాటిన తరువాత ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన జీవనశైలి అలవాట్లు అనుసరించడం అత్యంత అవసరమని వారు సూచిస్తున్నారు. అలాగే 40 ఏళ్ల వయస్సులో ఆరోగ్యంగా ఉండటానికి పాటించే 7 ముఖ్య అలవాట్లను కూడా వైద్యులు తెలియజేస్తున్నారు. చిన్నచిన్న మార్పులు కూడా దీర్ఘకాల ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతాయని, ఈ అలవాట్లను దినచర్యలో భాగంగా చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



మొదటగా, సరైన నిద్రను అత్యంత ప్రాధాన్యమైన అంశంగా తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. రోజుకు 7-8 గంటల నిద్ర పోవడం ద్వారా గట్ బ్యాక్టీరియా సమతౌల్యం మెరుగుపడి, శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గుతుంది. అలాగే రోజువారీ శారీరక చలనం కూడా ఎంతో కీలకం. ప్రతి రోజు నడక, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ చేయడం, అలాగే సరిపడా ప్రోటీన్ తీసుకోవడం ద్వారా కండరాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీర్ఘకాల ఆరోగ్యానికి కండరాల బలం ముఖ్య సూచికగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదే విధంగా ఫైబర్ అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా అవసరం. బీన్స్, కూరగాయలు, బెర్రీస్, విత్తనాలు వంటి ఆహారాలు గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే చాలామంది అవసరమైన ఫైబర్ పరిమాణంలో సగం మాత్రమే తీసుకుంటున్నారని వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే ఫెర్మెంటెడ్ (పులిసిన) ఫుడ్స్‌ను ఆహారంలో చేర్చుకోవాలి. పెరుగు, కెఫిర్, కిమ్చీ, సావర్‌క్రౌట్ వంటి ఆహారాలు గట్ మైక్రోబయోమ్‌ను (మంచి బ్యాక్టీరియా) బలోపేతం చేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

అంతేకాకుండా అత్యధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం కూడా ఆరోగ్యానికి ఎంతో కీలకమని వైద్యులు చెబుతున్నారు. పూర్తిగా నివారించడం కష్టమైనప్పటికీ, ఎక్కువగా సహజమైన, పూర్తి ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిది. వీటితోపాటు మానసిక ఒత్తిడిని తగ్గించడం కూడా అత్యంత అవసరం. దీర్ఘకాలిక ఒత్తిడి జీర్ణక్రియను మందగించి, గట్-బ్రెయిన్ సంబంధాన్ని దెబ్బతీస్తుందని, ధ్యానం వంటి పద్ధతులు ఒత్తిడిని తగ్గించడంలో సహాయ పడతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడం కూడా ఆరోగ్యకరమైన జీవనశైలిలో ఒక భాగమే. జీవితాంతం నేర్చుకునే తత్వం శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. 30ల నుంచే ఈ అలవాట్లను ప్రారంభించడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. చిన్నచిన్న రోజువారీ మార్పులు గట్ ఆరోగ్యం, మెటాబాలిజం, దీర్ఘకాల ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతాయని వారు స్పష్టం చేస్తున్నారు.

# విశాఖలో పలు ఐటీ కంపెనీలకు భూములు కేటాయింపు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పలు ఐటీ కంపెనీలకు విశాఖపట్నం జిల్లాలో భూములు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ కేటాయింపులు చేసింది. క్రెడెన్స్ రియాల్టీ సంస్థకు ఐటీ పార్క్ ఏర్పాటు చేయడానికి ఎక్కడ ఎంత భూమి కేటాయించారో వివరాలు పేర్కొనకుండా రూ.368.88 కోట్లు పెట్టుబడి పెడుతుందని, 6,500 మందికి ఉద్యోగాలు ఇస్తుందని పేర్కొంది. వారికి కేటారుంచే భూమికి జాతీయ రహదారి నుంచి ప్రవేశం, నిష్క్రమణకు ఏర్పాట్లు చేయాలని నేషనల్ హైవే అథారిటీని ఆదేశించింది. సర్వీస్ రహదారిని ఏడు మీటర్ల నుంచి 18 మీటర్లకు విస్తరించాలని వీఎంఆర్‌డీఏకి సూచించింది. ఆ భూమి ఎక్కడనేది మాత్రం పేర్కొనలేదు. ఫ్యుజిక సాఫ్ట్‌వేర్ కంపెనీకి కాపులుప్పాడ ఐటీ పార్కులో రెండు ఎకరాలు కేటాయించారు. ఎకరాకు రూ.4 కోట్ల ధర నిర్ణయించారు. వీరు మొత్తం రూ.425 కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా 2,500 మందికి ఉద్యోగాలు ఇస్తారు. తొలి దశలో రూ.213.87 కోట్లు పెట్టుబడి పెడతారు. వీరు రెండేళ్లలో వేయి మందికి ఉద్యోగాలు ఇవ్వాలని నిబంధన పెట్టారు. ఐస్ప్రౌట్ సంస్థకు బిజినెస్ సెంటర్ , ఐటీ కో వర్కింగ్ స్పేస్ కోసం రెసిడెన్షియల్, ఆతిథ్య రంగం, వాణిజ్య అవసరాల నిమిత్తం 9.5 ఎకరాలు కేటాయించారు. అందులో 3.5 ఎకరాలు మధురవాడలో ఎకరా రూ.15 కోట్లు చొప్పున, కాపులుప్పాడలో ఆరు ఎకరాలు ఎకరా కోటి రూపాయలు చొప్పున ఇచ్చారు. వీరు రూ.629.9 కోట్ల పెట్టుబడి పెట్టి 12,500 మందికి ఉద్యోగాలు ఇస్తారు. శ్రీటెక్ డేటా లిమిటెడ్ సంస్థ కేబుల్ ల్యాండింగ్ సెంటర్ కోసం 1.28 ఎకరాలు కోరగా కాపులుప్పాడలో 40 సెంట్లు కేటాయించారు. ఎకరా ధర రూ.1.5 కోట్లుగా నిర్ణయించారు.వీరు రూ1,800 కోట్లు పెట్టుబడి పెడతారు. డేటా సెంటర్లు, కేబుల్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా పెద్దగా ఉద్యోగాలు రానందున ఉపాధి ఎంతమందికి అనేది వెల్లడించలేదు. గూగుల్ డేటా సెంటర్ తరపున అదానీ ఇన్‌ఫ్రా నిర్మాణ పనులన్నీ చేపడుతుండడంతో ఆ సంస్థ అడిగిన మినహాయింపులన్నీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో కేటాయించిన 601 ఎకరాలకు ఏపీఐఐసీ లీజ్ డీడ్ రాయగా, దాన్ని అదానీ కోర్కె మేరకు సేల్ డీడ్‌గా మార్చారు. వాటిపై హక్కులన్నీ అదానీకే ఉంటాయి. ఇవికాకుండా డేటా సెంటర్ల నిర్మాణంలో తాము బఫర్ జోన్ ఉంచబోమని చెప్పగా దానికి కూడా ఓకే చేశారు. ఈ సెంటర్లకు సమీపంలో ఉన్న కంబాలకొండ అభయారణ్యం నుంచి, రాంబిల్లిలో నేవీ న్యూక్లియర్ సబ్‌మెరైన్ స్థావరం నుంచి నిరభ్యంతర పత్రాలు ఇవ్వడానికి అంగీకరించింది. ఎవరికైనా నిర్మాణాలు పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు ఇస్తారు. వీరికి మాత్రం కొంత పూర్తిచేసినా సర్టిఫికెట్లు ఇవ్వడానికి అంగీకరించారు. ప్రహరీ గోడ ఎత్తు సాధారణంగా మీటరు ఎత్తు ఉంటుంది. వీరు 3.6 మీటర్లు పెడతామంటే దానికీ ఓకే చేశారు. ఫ్లోర్ నుంచి సీలింగ్ ఎంత ఎత్తులో ఉండాలనే దానిపై నిర్మాణం బట్టి ఆంక్షలు ఉంటాయి. కానీ తమకు అవి వర్తించకుండా చూడాలని కోరగా..దానికీ అంగీకరించారు. ప్రతి భవనానికి పార్కింగ్ నిబంధనలు ఉంటాయి. అదానీ సంస్థ వాటి నుంచి మినహాయింపు కోరగా దానికీ ఆమోదం తెలిపారు.

## మళ్లీ హర్మూజ్‌ను మూసేసిన ఇరాన్



**ఇరాన్:** ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసినట్లు శనివారం వెల్లడించింది. తమ నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేలా అమెరికా ఆంక్షలను ఎత్తివేసే వరకు, హర్మూజ్‌పై తమ కఠిన నియంత్రణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. అణ్వస్త్ర కార్యక్రమం సహా అన్ని అంశాలపై తమతో తుది ఒప్పందాన్ని కుదుర్చుకునే దాకా ఇరాన్ ఓడరేవుల ముట్టడిని ఆపేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకోంది. లెబనాన్ – ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా హర్మూజ్‌ను పూర్తిగా తెరిచినట్లు శుక్రవారమే ఇరాన్ ప్రకటించింది. అయినప్పటికీ తమ ఓడరేవుల ముట్టడిని అమెరికా కొనసాగిస్తున్నందుకు నిరసనగా, కొన్ని గంటల్లోనే ఇరాన్ నిర్ణయాన్ని మార్చుకుంది. హర్మూజ్ జలసంధి మార్గంలో మళ్లీ ఆంక్షలను అమల్లోకి తెచ్చామని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ (ఖతం అల్ అంబియా) శనివారం ప్రకటించింది. హర్మూజ్, దాని పరిసర ప్రాంతాలను మునుపటిలాగే తమ సైనిక దళాలు పకడ్బందీగా కంట్రోల్ చేస్తాయని తెలిపింది. తమ ఓడరేవులను ముట్టడించడం ద్వారా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ జాయింట్ మిలిటరీ కమాండ్ ఆరోపించింది. ఈ ముట్టడిని అమెరికా కొనసాగించినన్ని నాళ్లు, హర్మూజ్ ముట్టడిని తాము కొనసాగిస్తామని తేల్చి చెప్పింది. అమెరికా – ఇరాన్ మధ్య మరోవిడత శాంతిచర్చలు ఈనెల 20న పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం ఇరుదేశాల ప్రతినిధులు ఆదివారంకల్లా ఇస్లామాబాద్‌కు చేరుకుంటారని సమాచారం. చర్చలతో సంబంధమున్న పలువురు ఇరాన్ అధికార వర్గాలు ఈవివరాలను చెప్పాయంటూ అమెరికా మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. సరిగ్గా ఈ తరుణంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ మళ్లీ ఆంక్షలను అమల్లోకి తేవడం గమనార్హం. అమెరికాపై ఒత్తిడిని పెంచడంతో పాటు తమ ఓడరేవుల ముట్టడిని అడ్డుకునేందుకే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. హర్మూజ్ నియంత్రణ విషయంలో ఇరాన్, ఇరాన్ ఓడరేవుల ముట్టడిపై అమెరికా మొండివైఖరితో వ్యవహరిస్తుండటంతో పశ్చిమాసియాలో మళ్లీ సైనిక ఉద్రిక్తతలు పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తుర్కియేలోని అంటాల్య నగరంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో ఖతార్ రాజు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ, తుర్కియే అధ్యక్షుడు రజబ్ తయ్యబ్ ఎర్డోగన్ భేటీ అయ్యారు.




## పంజాబ్ కింగ్స్‌ను అద్భుతంగా నడిపిస్తున్న శ్రేయస్ అయ్యర్



ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆడిన అన్ని మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను అభిమానులు, సహచర ఆటగాళ్లు 'సర్పంచ్ సాబ్' అంటూ పిలుస్తారన్న విషయం తెలిసిందే. పంజాబ్ కింగ్స్ జట్టులో చేరిన తర్వాతే అయ్యర్‌కు ఈ నిక్‌నేమ్ పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రేయస్ ఆ ట్యాగ్ గురించి వివరించాడు. మొదట్లో సర్పంచ్‌కు అర్థం తెలియక అయోమయంగా అనిపంచేదని, మీనింగ్ తెలుసుకున్న తర్వాత స్పష్టత వచ్చిందని తెలిపాడు. 'నాకు 'సర్పంచ్' అనే పదం బాగా నచ్చింది. పంజాబ్ కింగ్స్‌తో ప్రయాణం మొదలైనప్పుడు ఇలా ఎందుకు పిలిచారో కూడా తెలియదు. గందరగోళంగా అనిపించేది. అప్పుడే సహచరులను అడిగా. సర్పంచ్ అంటే ఏంటో వారు వివరించారు. కుటుంబం, ఒక గ్రూప్, లేదా ఊరు.. ఇలాంటి వాటికి పెద్దగా వ్యవహరించేవారినే సర్పంచ్ అంటారని తెలిసింది. అప్పటినుంచి 'సర్పంచ్' నా ప్రయాణంలో భాగమైంది. నాకెంతో ఇష్టమైన నిక్‌నేమ్‌గా మారిపోయింది' అని శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు. గతేడాది పంజాబ్ కింగ్స్ సారథిగా వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చిన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో అయ్యర్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో 203 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్‌లో 14 సిక్సులు, 14 ఫోర్లు ఉన్నాయి.

## విజృంభించిన గిల్..

# గుజరాత్ టైటాన్స్ గెలుపు



రెండు ఓటములతో ఈ ఐపీఎల్‌ను ఆరంభించిన గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం నిలకడగా దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 86) కళాత్మక బ్యాటింగ్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో నెగ్గిం ది. జీటీకిది హ్యాట్రిక్ విజయం కాగా.. అటు కేకేఆర్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకటి వర్షంతో రద్దుకాగా, మిగిలిన ఐదింటిలోనూ ఓడింది. ఈ మ్యాచ్‌లో ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 79), పోవెల్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) మాత్రమే రాణించారు. రబాడకు మూడు.. సిరాజ్, అశోక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. బట్లర్ (25), సుదర్శన్ (22) రాణించారు. వరుణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు. ఓ మాదిరి ఛేదనను గుజరాత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. అయినా కేకేఆర్ బౌలర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. మ్యాచ్‌ను కాపాడుకునేందుకు చివరి ఓవర్ వరకు పోరాడినా టైటాన్స్‌దే పైచేయి అయ్యింది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగడంతో తొలి మూడు ఓవర్లలోనే స్కోరు 40కి చేరింది. ఆరో ఓవర్‌లో సుదర్శన్ వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో బట్లర్ 4,6,4తో పవర్‌ప్లేలో టైటాన్స్ 71/1 స్కోరుతో పటిష్టంగా నిలిచింది. కానీ మధ్య ఓవర్లలో కేకేఆర్ బౌలర్లు గుజరాత్‌ను కట్టుదిట్టం చేశారు. 27 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. అటు బట్లర్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేశాడు. సుందర్ (13) కూడా విఫలమయ్యాడు. అయితే 17వ ఓవర్‌లో గ్రీన్ డైవింగ్ క్యాచ్‌తో గిల్ పోరాటం ముగిసింది. అప్పటికి సమీకరణం 18 బంతుల్లో 23 పరుగులకు చేరింది. చివరి ఓవర్లో ఆరు పరుగులు చేయాల్సి వచ్చింది. ఫిలిప్స్ (19)ను పేసర్ రమణ్‌దీప్ అవుట్ చేసినా మరో 2 బంతులుండగానే టైటాన్స్ మ్యాచ్‌ను ముగించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఎట్టకేలకు గ్రీన్ బ్యాట్ ఝుళిపించినా, అతడికి మరో ఎండ్‌లో సహకారం కరువైంది. దీనికి తోడు ఆఖర్లో గుజరాత్ బౌలర్లు 33 పరుగులే ఇచ్చి చివరి 6 వికెట్లు పడగొట్టారు. దీంతో కేకేఆర్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ రహానె తొలి ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ కాగా, రెండో ఓవర్‌లోనే రఘువంశీ (8) కూడా వెనుదిరిగాడు. ఇక ఆలెన్ స్థానంలో బరిలోకి దిగిన మరో ఓపెనర్ సైఫర్ట్ (19) నాలుగో ఓవర్‌లో రబాడకు చిక్కాడు. తద్వారా పవర్‌ప్లేను కేకేఆర్ 32/3 స్కోరుతో పేలవంగా ముగించింది. ఈ దశలో గ్రీన్–పోవెల్ అడపాదడపా బౌండరీలతో నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించారు. 11వ ఓవర్‌లో పోవెల్ నిష్క్రమించాక గ్రీన్ జోరు పెంచాడు. 12వ ఓవర్‌లో స్పిన్నర్ రషీద్‌ను లక్ష్యంగా చేసుకుని 4,6,4తో 16 రన్స్ సాధించగా.. పేసర్ అశోక్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు.




# తుది దశలో కొనసాగుతున్న 'లెనిన్' షూటింగ్



హీరో అఖిల్ అక్కినేని లేటెస్ట్ మూవీ 'లెనిన్' షూటింగ్ తుది దశలో కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన తొలి సాంగ్ 'వారేవా వారేవా..'కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. తమన్ సంగీత సారథ్యంలో విడుదలైన ఈ సాంగ్‌తో మూవీ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ సినిమా నుంచి 'ఎట్టా ఎట్టా..' అనే రెండో పాట విడుదలైంది. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించారు. సింగర్ శ్రీకష్ణతో కలిసి తమన్ ఈ పాటను పాడారు. భాస్కరభట్ల ట్యూన్‌కు తగ్గట్టు చక్కటి సాహిత్యాన్ని అందించారు. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథతో పూర్తి ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది.

ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో విడుదల కానుంది. ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా 'లెనిన్' సినిమాను రూపొందిస్తున్నా మని చిత్ర యూనిట్ తెలిపింది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# విడాకుల వార్తలపై మౌనం వీడిన హన్సిక



తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




# 'మైసా'తో మెస్మరైజింగ్ చేయబోతున్న రష్మిక...



సినిమాలలో నటించి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రశ్మికలో మంచి నటి కూడా ఉంది. ఇప్పటికే పలు చిత్రాలలో ఆమె నటనకు ఆస్కారమున్న పాత్రలు చేసి మెప్పించింది. అలానే హీరోయిన్ ఓరియెంటెడ్ మూవీస్‌ను ఆమెతో చేయడానికి నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. రచయితలు ఆమెను దృష్టిలో పెట్టుకుని కథలు రాస్తున్నారు. అలా తెరకెక్కుతున్న సినిమానే 'మైసా' . గోండ్ తెగల బ్యాక్ డ్రాప్ లో హై-ఆక్టేన్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'మైసా' ఉండబోతోంది. రశ్మిక మందన్న ఇంతకు ముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్‌లో కనిపించ బోతోంది. ఈ సినిమా కోసం రశ్మిక మందన్న పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ఏకంగా రోజూ ఎనిమిది గంటల పాటు శరీర ధృడత్వం కోసం రశ్మిక ట్రైనింగ్ తీసుకుంటోంది. చిత్ర బృందం చెబుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం రశ్మిక బ్యాంకాక్‌లో ఉంది. అక్కడ రోజుకు ఎనిమిది గంటల పాటు శిక్షణ తీసుకుంటోంది. దీనికి సంబంధించిన ఫోటోలు కొన్ని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ట్రైనర్ సాయంతో రశ్మిక చేస్తున్న ప్రాక్టీస్ చూస్తుంటే... ఈ చిత్రం ఆమె కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలుస్తుందనిపిస్తోంది. ఈ శిక్షణ పూర్తి కాగానే 'మైసా' తాజా షెడ్యూల్ కేరళలో మొదలు పెట్టి, దాదాపు 16 రోజుల పాటు కొనసాగించబోతున్నారు.

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడానికి పడే కష్టాన్ని మాటల్లో వర్ణించడం కష్టం. వృత్తిపట్ల అంకితభావం ఉన్న కారణంగానే ఇవాళ రశ్మిక మందన్న జాతీయ స్థాయిలో కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకోగలిగింది. ఆమెతో సినిమా చేయాలని దర్శక నిర్మాతలు క్యూ కట్టడానికి కూడా అదే కారణం. కమర్షియల్ ఈ సినిమాలో యాక్షన్ కొరియోగ్రఫీ సైతం సమ్ థింగ్ స్పెషల్‌గా ఉంటుందని, ఆమె స్టిల్స్ చూస్తే అర్థమౌతోంది. ఈ పవర్ ఫుల్ ఫీమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ ద్వారా రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**